సాక్షి అనకాపల్లి
మంగళవారం, 29, ఆగస్టు, 2023



క్షేత్ర స్థాయి సమస్యలపై విచారణ

ప్రత్యేకాధికారులు స్పందన జవాబులను పర్యవేక్షించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. 8లో



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



శ్రీవారి పవిత్రోత్సవం

విశాఖ: శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవం సోమవారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు ఈ వేడుకలు జరగనున్నాయి.

పెద్దలకు 'ఉపాధి' పిల్లలకు ఉన్నతి

సీడాప్



మాది అనకాపల్లి మండలం కొండుపాలెం గ్రామం. వ్యవసాయ ఆధారిత కుటుంబం. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 'సీడాప్–ఉన్నతి' ప్రాజెక్ట్‌లో నైస్ మ్యాన్‌పవర్‌లో శిక్షణ తీసుకున్నాను. విశాఖ సెంట్రల్ ఫార్మసీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాను. నాకు రూ.15 వేల జీతం ఇస్తున్నారు.

– మదక గౌతమి



మాది పాడేరు మండలం మునగలపాలెం గ్రామం. మా కుటుంబ సభ్యులు ఎన్ఆర్ఈజీఎస్‌లో ఉపాధి పనులకు వెళుతుంటారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 'సీడాప్– ఉన్నతి' ప్రాజెక్ట్‌లో చినముషిడివాడ డేటాప్రో కంప్యూటర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉచితంగా శిక్షణ పొందాను. శిక్షణ అనంతరం విశాఖ టెక్‌మహీంద్రా సెంటర్లో గల డీఎస్ఎస్ కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఎంపికయ్యాను. నాకు రూ.15 వేల జీతం ఇస్తున్నారు.

–ఎ.కొండమ్మ

- సీడాప్ ద్వారా ఉపాధి కూలీల పిల్లలకు చేయూత
- 100 శాతం ప్లేస్‌మెంట్ లక్ష్యంగా ఉచిత శిక్షణ
- ఒక్కో అభ్యర్థి శిక్షణ నిమిత్తం రూ.44,850 వరకు ఖర్చు
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఇంతవరకు 321 మందికి శిక్షణ..
- వారిలో 227 మందికి ఉద్యోగాలు



పనుల్లో నిమగ్నమైన ఉపాధి కూలీలు..



శిక్షణ పొందుతున్న వారి వారసులు

సాక్షి, అనకాపల్లి: కూలీల పిల్లలు కూలీలుగానే మిగిలిపోకూడదు. అర్హత ఉన్న వారికి కచ్చితంగా అవకాశం కల్పించాలి. వారిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టాలి. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ ఆశయం. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపింది. వలసలు నివారించింది. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి ఉపాధిహామీపై ఆధారపడిన వారి కుటుంబాల్లోని యువతీ యువకులకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా భరోసా కల్పిస్తున్నది. సీడాప్ ద్వారా ఉచిత వసతి, భోజన సదుపాయాలతో శిక్షణ ఇప్పించి.. సీడాప్, ఎస్‌డీటీ డిపార్ట్‌మెంట్‌లతో కలిసి 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళిక అమలు చేస్తోంది. సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్) ద్వారా ఉపాధి కూలీల పిల్లలకు ఉజ్వల భవిష్యత్ అందించే క్రమంలో 'ఉన్నతి' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందుకు ఒక్కో అభ్యర్థి నిమిత్తం ప్రభుత్వం రూ.44,850 ఖర్చు చేస్తోంది.

ఎవరు అర్హులు..

ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన పిల్లలకు 'ఉన్నతి' కార్యక్రమాన్ని సీడాప్ అమలు చేస్తోంది. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారికి ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. 2018 నుంచి 2024 ఆర్థిక సంవత్సరాల వరకు 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలను డ్వామా సహకారంతో సీడాప్ అధికారులు గుర్తిస్తున్నారు.

321 మందిలో 227 మందికి ఉద్యోగాలు

2019–20 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధి శాఖ, డ్వామా శాఖ సంయుక్తంగా 'ఉన్నతి' కార్యక్రమాన్ని అమలు చేశాయి. కరోనా కారణంగా మొదటి ఏడాదిలో ఒక బ్యాచ్‌కు శిక్షణ అందించారు. అనంతరం రెండేళ్లపాటు శిక్షణ నిలిపివేసినప్పటికీ.. గత ఆర్థిక సంవత్సరంలో పునఃప్రారంభమైంది. ఇప్పటి వరకు అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి 321 మందికి శిక్షణ అందించగా.. వారిలో 227 మందికి ఉద్యోగాలు వచ్చాయి

ఐదు సంస్థల్లో శిక్షణ

విశాఖ నగరంలో ఐదు సంస్థల్లో అభ్యర్థులకు శిక్షణ అందిస్తున్నారు. షీలానగర్‌లో గల మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ట్రెనింగ్ సెంటర్‌లో లాజిస్టిక్ సెక్టార్ (వేర్‌హౌస్ క్లయిమ్స్ కోఆర్డినేటర్ కోర్సు)లో ట్రెయినింగ్ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు డబ్ల్యూఎస్ఎస్, అమెజాన్, నవత, బిగ్ బాస్కెట్ మొదలైన సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయి.
సంప్రదించాల్సిన నంబర్: రవికిరణ్ 9985760780

- చినముషిడివాడ డేటాప్రో కంప్యూటర్ సెంటర్ సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: ప్రసాద్ 9121284700.
- పెందుర్తిలోని కైట్స్ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ట్రెనింగ్ సెంటర్‌లో ఐటీ–ఐటీఈఎస్ సెక్టార్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (డొమెస్టిక్ నాన్ వాయిస్) కోర్సులో శిక్షణ. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: సుభాన్ 7013678213.
- గోపాలపట్నంలోని కైట్స్ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ట్రెనింగ్ సెంటర్‌లో ఐటీ–ఐటీఈఎస్ సెక్టార్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (డొమెస్టిక్ నాన్ వాయిస్) కోర్సులో శిక్షణ. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: జ్యోతి 8121382753.

శిక్షణ అనంతరం అభ్యర్థులకు ఆర్ఎపిఎస్ టెక్నాలజీస్, హరిరాం ఇన్ఫోటెక్, ట్రిగ్యో టెక్నాలజీస్, 'వి' ఇన్ఫో టెక్నాలజీస్ మొదలైన వాటిలో ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యం..



అర్హత ఉన్న కుటుంబంలో నిరుద్యోగులుంటే దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణ తీసుకొని ఉపాధి పొందవచ్చు. ప్రస్తుతం 120మందికి శిక్షణ అందిస్తున్నాం. శిక్షణా కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, సేల్స్ సూపర్‌వైజర్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

– ఇ.సందీప్, విశాఖ, అనకాపల్లి జిల్లాల డ్వామా పీడీ

నేడు బీచ్‌లో ఎకో వైజాగ్ వాక్

- పాల్గొనున్న బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌బిన్నీ

దాబాగార్డెన్స్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా జీవీఎంసీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 6 గంటలకు ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు 'ఎకో–వైజాగ్ వాక్' నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శరత్‌చంద్రారెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

దొండపర్తి: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు నిర్మాణ్ సంస్థ సీఈఓ మయూర్ పట్నాల తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న యువతీ, యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు.

టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా బాజీ జంక్షన్ ప్రాంతంలో ఉన్న నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ, 9502874304, 9908104113 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

మలివిడత పాలవెల్లువ పనులు వేగవంతం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం



తుమ్మపాల: జిల్లాలో చేపట్టిన పాలవెల్లువ పథకం మలివిడత పనులను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమకు అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, పాలసేకరణకు స్థల అన్వేషణ చేపట్టాలని సూచించారు. శరవేగంగా 80 శాతం పనులను పూర్తి చేయాలన్నారు. పాలవెల్లువ ద్వారా రైతులకు కలిగే ఉపయోగాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పాల సేకరణ కేంద్రాల్లో సమర్థులైన ఏజెంట్లను నియమించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పాలసేకరణకు సంబంధించి పురోగతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి కిరణ్‌కుమార్, వెటర్నరీ వైద్యులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు నర్సీపట్నం క్రీడాకారులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నింజాస్ చైర్మన్, డైరెక్టర్లు

నర్సీపట్నం: నర్సీపట్నానికి చెందిన నలుగురు బాక్సింగ్ క్రీడాకారులు ఈ నెల 29, 30 తేదీల్లో గుంటూరు జరిగే రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ కేటగిరీలో వేపాడ ప్రియాంక, జూనియర్ బి.రాజరాజేశ్వరి, సబ్ జూనియర్ కేటగిరీలో కురచా శరణ్య శౌప్రియ, కురచా శర్వాణి పోటీల్లో పాల్గొంటున్నారు. వీరిని నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్స్ బోళెం శివ, కోచ్ యర్రా శేఖర్ క్రీడాకారులను అభినందించారు.

31న మినీ జాబ్‌మేళా

అనకాపల్లి టౌన్: రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డీస్ కంపెనీతో మినీ జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 21 సంవత్సరాలలోపు వారై ఉండాలని, డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) విద్యార్హత గల యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 8143229228, 7036363272 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఏయూలో డిజిటల్ కాగ్నెటివ్ థెరపీ సెంటర్ ప్రారంభం



సెంటర్ ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఏయూలో డిజిటల్ కాగ్నెటివ్ థెరపీ సెంటర్ ఏర్పాటైంది. కెనడాకు చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ ఏయూతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అధునాతన డిజిటల్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ని ఏయూకు అందించింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని నార్త్ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ సీఈఓ డాక్టర్ వినయ్ సింఘ్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు. దీని సహాయంతో విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి.. అవసరమైన వారికి వెంటనే చికిత్స అందించవచ్చని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. భవిష్యత్తులో సౌత్ క్యాంపస్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

30న షాలిమార్–సికింద్రాబాద్ రద్దు

తాటిచెట్లపాలెం: ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం, లింక్ రైలు అందుబాటులో లేనందున ఈ నెల 30వ తేదీన షాలిమార్–సికింద్రాబాద్(22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం



కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖుబా, ఎంపీ జీవీఎల్‌తో అభ్యర్థులు

కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా

తాటిచెట్లపాలెం: దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే ప్రధాని మోదీ ఆశయమని, దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా సోమవారం 8వ రోజ్‌గార్ మేళా నిర్వహించి, అర్హులైన అభ్యర్థులకు నేరుగా నియామకపత్రాలు అందజేశామని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా తెలిపారు. సోమవారం సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్‌లో జరిగిన రోజ్‌గార్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ రోజ్‌గార్ మేళా ప్రారంభించి, ఇప్పటి వరకు సుమారు 5 లక్షల మందికి పైగా వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు కల్పించారన్నారు. సోమవారం వర్చువల్‌గా మరో 51 వేల మందికి నియామకపత్రాలు దేశ వ్యాప్తంగా 45 ప్రాంతాల్లో అందజేశామని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ 2024 మే నెలాఖరు నాటికి 10 లక్షల ఉద్యోగాలు మోదీ ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యాదీవెన రూ.24.85 కోట్లు

- జిల్లాలో 37,609 మందికి లబ్ధి



విద్యార్థులు, తల్లిదండ్రులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకంలో భాగంగా 37,609 మంది విద్యార్థులకు రూ.24 కోట్ల 85 లక్షల 89వేల 179 జమ చేస్తున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా నగరిలో సోమవారం వర్చువల్ విధానంలో విద్యాదీవెన నిధిని బటన్ నొక్కి ప్రారంభించగా.. గుండాలవీధి సచివాలయం నుంచి కలెక్టర్ లబ్ధిదారులు, అధికారులతో కలిసి కార్యక్రమాన్ని వీసీలో వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నమూనా చెక్కును అందించారు. 2022–23 త్రైమాసికానికి సంబంధించి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో వెనుకబడిన తరగతులకు చెందిన 33 వేల 974 మందికి రూ.22 కోట్ల 35 లక్షల 94 వేల 498, సాంఘిక సంక్షేమశాఖ కింద 2,885 మందికి రూ.2 కోట్ల 4 లక్షల 56 వేల 704, గిరిజన సంక్షేమశాఖ ద్వారా 519 మందికి రూ.28,38,652, ఈబీసీ కింద 1,307 మందికి రూ.99,60,063, కాపు సంక్షేమం కింద 2,823 మందికి రూ.1,79,47,654, ముస్లిం మైనార్టీ కింద 187 మందికి రూ.13,63,630, క్రిస్టియన్ మైనార్టీ కింద 44 మందికి రూ.3,35,695 జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అజయ్‌బాబు, బీసీ సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి, గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగశిరీష పాల్గొన్నారు.

క్రీడా సుమాలు

ఆటలు ఆహ్లాదాన్నే కాక ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తాయి. ఉత్తమ కెరీర్‌ను మలచుకునేందుకు కూడా దోహద పడుతున్నాయి. క్రీడారంగంలో రాణించడం ఒక చక్కని అభిరుచిగా మారింది. ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. మంగళవారం క్రీడాదినోత్సవం సందర్భంగా కథనాలు..

పవర్ లిఫ్టింగ్‌లో అసమాన ప్రతిభ





నాగజ్యోతికి వెండి పతకాలను అందిస్తున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ అధికారులు

- జాతీయ పోటీల్లోనూ సత్తా చాటిన టీచర్ నాగజ్యోతి
- బెంచ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో వెండి పతకాలు

రావికమతం: కొత్తకోట గ్రామానికి చెందిన ఇంగ్లిషు ఉపాధ్యాయిని పి.వి.ఎం.నాగజ్యోతి బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ జాతీయ పోటీల్లో సత్తా చాటారు. ఈ రెండు విభాగాల్లో ఏకంగా రజత పతకాలను కైవసం చేసుకున్నారు. ఏపీ స్టేట్ పవర్‌లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న రాష్ట్ర డెడ్‌లిఫ్ట్, బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు జరగగా నాగజ్యోతి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భిలాయిలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగిన జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో మన రాష్ట్రం తరఫున ఆమె పాల్గొని ఘన విజయం సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 25 మంది క్రీడాకారిణులు పాల్గొనగా నాగజ్యోతి ద్వితీయ స్థానంలో నిలిచి రెండు విభాగాల్లోనూ వెండి పతకాలను సాధించారు. ఇంతటి ఘనత సాధించిన ఆమెను పలువురు ఉపాధ్యాయులు, మిత్రులు సోషల్ మీడియా వేదికగా అభినందనలతో ముంచెత్తారు.

నాన్న కలను నిజం చేస్తూ..

- అంతర్జాతీయ బాక్సర్‌గా ఎదిగేందుకు భవానీ ప్రసాద్ కృషి
- దుబాయ్ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం



దుబాయ్ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం పొందిన భవానీ ప్రసాద్



భవానీ ప్రసాద్ సాధించిన పతకాలు

అచ్యుతాపురం (అనకాపల్లి): తాను బాక్సర్‌గా ఎదగాలనుకున్నాడు.. కాలం కలిసిరాక లారీ డ్రైవర్‌గా మిగిలాడు. అయితేనేం తన ఆశయాన్ని సజీవంగా ఉంచుకున్నాడు. కొడుకు ద్వారా తన కలను నెరవేర్చుకుంటున్నాడు. విశాఖకు చెందిన కాకి వెంకట సత్యనారాయణ బాక్సర్ అవ్వాలని భావించారు. రెండుసార్లు నేషనల్స్‌లో పాల్గొన్నారు కూడా. కానీ కాలం కలిసి రాలేదు. బతుకు తెరువు కోసం లారీ డ్రైవర్‌గా మారిపోయిన సత్యనారాయణ యలమంచిలి మండలం పురుషోత్తపురానికి వలస వచ్చారు. అక్కడికి సమీపంలోని ఒక సిమెంట్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ.. తన కుమారుడు, కుమార్తెలకు బాక్సింగ్‌లో శిక్షణ ఇప్పించారు. కుమార్తె మధ్యలోనే విరమించగా 9 ఏళ్ల ప్రాయం నుంచి బాక్సింగ్‌లో శిక్షణ పొందిన కుమారుడు భవానీ ప్రసాద్ పతకాలు సాధిస్తూ.. తండ్రి కలను నిజం చేస్తున్నాడు. బాక్సింగ్ శిక్షణ అంటే ఆషామాషీ కాదు. కఠినంగా ఉండడమే కాదు శారీరక దారుఢ్యం నిలుపుకునేందుకు ఫీడింగ్‌కే బోలెడంత ఖర్చవుతుంది. కొడుకును తీర్చిదిద్దడానికి సత్యనారాయణ లక్షల్లో అప్పు చేశారు. తండ్రి తపనను అర్థం చేసుకున్న భవానీ ప్రసాద్ బాక్సింగ్ రింగ్‌లో దూసుకుపోవడం మొదలుపెట్టాడు. ఇప్పటి వరకు ఐదుసార్లు నేషనల్స్‌లో పాల్గొన్న ఈ బాక్సర్ ఇటీవల దుబాయ్‌లో ఓపెన్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తాజాగా చెన్నయ్‌కి సమీపంలోని కడలూరులో నిర్వహించిన జాతీయ స్థాయి బాక్సింగ్‌లో ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ ర్యాంక్‌ను సాధించిన ప్రసాద్ ప్రస్తుతం విశాఖలోని నేషనల్ బాక్సర్ అమోర్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. తన కుమారుడు అంతర్జాతీయ స్థాయిలో టాప్ 50లో స్థానం సంపాదించాలన్నది తన లక్ష్యమని, దీని కోసం ఎంత కష్టమైనా పడతానని సత్యానారాయణ సాక్షికి తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్.. కేరాఫ్ నునపర్తి



బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్న నునపర్తి క్రీడా మైదానం

- చిన్న గ్రామంలో 35 మంది జాతీయ స్థాయి క్రీడాకారులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం–పరవాడ మండలాలకు సరిహద్దుల్లో కొండ ప్రాంతంగా భావించే నునపర్తి అంటే క్రీడాకారులకు గుర్తొచ్చేది బాల్ బ్యాడ్మింటన్. ఈ గ్రామ పరిధిలో ఉన్న నాలుగు క్రీడా మైదానాల్లో నిరంతరం బాల్ బ్యాడ్మింటన్ సాధన చేస్తూనే ఉంటారు. ప్రతి ఏటా జిల్లా జట్టులోని పది మందిలో ఆరుగురు నునపర్తికి చెందిన వారు ఉంటారనడం అతిశయోక్తి కాదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వాడచీపురుపల్లి, అర్జాపురం, చోడవరం, ఏయూ, స్టీల్‌ప్లాంట్, గంట్యాడ, బీహెచ్‌పీవీ ప్రాంతాల్లో బాల్ బ్యాడ్మింటన్ ఆడే వారున్నారు. వారిలో ప్రతి ఒక్కరూ నునపర్తిలో శిక్షణ పొందినవారే. 1995లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన సీపీ పెదపూడి శంకరయ్య మాట్లాడుతూ.. తమ గ్రామంలో 120 మందికి పైగా సీనియర్ ప్లేయర్లు ఉన్నారని, అందులో 35మంది వరకు జాతీయ స్థాయి క్రీడాకారులున్నారని చెప్పారు. ఆయన శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్థాపించారు. ఈ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న గొంప నర్సింహనాయుడు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

లోకేష్, చంద్రబాబుపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్‌ఐ ధనుంజనాయుడుకు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

నర్సీపట్నం/గొలుగొండ: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిస్తున్న చంద్రబాబు, నారాలోకేష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోషల్ మీడియా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బైలపూడి నానిబాబు మాట్లాడుతూ యువగళం పేరుతో నారా లోకేష్, రోడ్ షోలతో చంద్రబాబు టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని, పుంగనూరు, మాచర్ల ఘటనలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చంనాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గొలుగొండలో కూడా పోలీసులకు ఫిర్యాదు అందించారు. ఫిర్యాదు చేసిన వారులో మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, సోషల్ మీడియా కో కన్వీనర్ చామంతుల సురేష్, మున్సిపాలిటీ కన్వీనర్ కర్రి శివ కుమార్, సుర్ల మురళీకృష్ణ ఉన్నారు.

క్షేత్ర స్థాయి సమస్యలపై తగు విచారణ చేపట్టాలి

- స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి

తుమ్మపాల : ప్రత్యేకాధికారులు స్పందన జవాబులను పర్యవేక్షించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ఆయనతో పాటు జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్వో అనిత, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మిపతి, డీఎల్‌డీవో మంజులావాణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా వచ్చే అర్జీలను స్పష్టతతో వేగంగా పరిష్కరించేలా సంబంధిత ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. మండల స్థాయిలో స్పందన అర్జీలపై సరైన పరిష్కారంతో కూడిన జవాబులు ఉండడం లేదని, జవాబుల్లో స్పష్టత లేకుండా సమస్యలను పరిష్కరించినట్టు చూపిస్తున్నారని వాటిపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలన్నారు.

సరైన పరిష్కారం చేసే విధంగా మండల స్థాయిలో సూచించాలన్నారు. ఒక్కసారి చేసిన ఫిర్యాదు, అర్జీ మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో సమస్యలపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం 306 అర్జీలు నమోదవ్వగా, అధిక శాతం రెవెన్యూ సంబంధిత అంశాలపైనే అర్జీలు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టాలి

కొఠంకోట మండలం వెదురుపర్తి, గంటవానిపాలెం గ్రామం వద్ద శారదానదిపై గల గ్రోయిన్ ధ్వంసమై సమీపంలో గల ఐదు గ్రామాలకు సాగునీరందడం లేదని, తక్షణమే గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టి పంట పొలాలకు నీరందించాలని గంటవానిపాలెం సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, వార్డుమెంబర్లు కలెక్టర్‌కు వినతి అందించారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసి జాహ్నవి

రోడ్డు పనులపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

వడ్డాది-పాడేరు రోడ్డుకు రూ.24 కోట్లు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభించలేదని, తక్షణమే రోడ్డు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాడుగుల నియోజకవర్గ సర్పంచ్, ఎంపీటీసీలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండడంతో 29 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కింతలి-మాడుగుల రోడ్డు అభివృద్ధితో 19 గ్రామాల రాకపోకలు సులభమవుతాయని తెలిపారు.

ల్యాండ్‌పూలింగ్‌పై విచారణ జరపాలి

అనకాపల్లి మండలం ల్యాండ్ పూలింగ్‌లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని,అధికారులు తక్షణమే స్పందించి రైతులకు వారికిచ్చే పట్టాలను అందించాలంటూ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ట్రేడింగ్‌పై సీఐడీ, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. మండలంలో 13 గ్రామాల్లో 11 వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకున్నారన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ

చట్టపరిధిలో సమస్యలు పరిష్కరిస్తా

అనకాపల్లిటౌన్ : చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 37 అర్జీలను ఆయన స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకున్న ఆయన పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ఎస్‌ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

రోలుగుంట: ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కొత్త పింఛన్లు మంజూరు చేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఘనతేనని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండలానికి మంజూరైన కొత్త పింఛనుదారులతో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎల్లవేళలా పేదల అభ్యున్నతి కోసమే పని చేస్తోందన్నారు. మండలంలో తొలివిడతగా 157 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కాగా, అక్టోబర్ నెలలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న మిగిలిన అర్హులకు కూడా పింఛన్లు మంజూరవుతాయన్నారు. వీటిని గమనంలో ఉంచుకొని వచ్చే ఎన్నికల్లో కూడా తమ ప్రభుత్వం ఏర్పడేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, తననూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, సర్పంచ్‌లు యర్రంశెట్టి కాంతమ్మ, గుములూరి బాబులు, లగుడు కృష్ణంనాయుడు, చిటికెల వెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పింఛను లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

టీటీడీని విమర్శించే అర్హత అనితకు లేదు

- చౌకబారు విమర్శలు మానుకోకపోతే తగిన శాస్తి చేస్తాం
- ఏపీఎస్‌యుఐడీసీ డైరెక్టర్ వీసం

నక్కపల్లి : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి నియామకంపై పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత చేస్తున్న చౌకబారు విమర్శలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెప్తామని రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం ఆయన నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. నిన్ను టీటీడీ పాలకమండలి సభ్యురాలిగా నియమించి వెంటనే ఎందుకు ఉపసంహరించుకున్నారో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అన్య మతస్తురాలిని అని స్వయంగా ఒప్పుకున్న నీవు టీటీడీ పాలకమండలిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు హయాంలోనే దోపిడీదార్లకు, కేసుల్లో ఇరుకున్నవారిని, కబ్జాకోరులకు పెద్ద పెద్ద పదవులు కట్టబెట్టారన్నారు. కరోనా సమయంలో ప్రపంచంలో అన్ని దేవాలయాలు మూతపడ్డాయన్నారు. అలాగే తిరుమల ఆలయాన్ని కూడా కొన్ని రోజులు మూసి వేసారన్నారు. సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా కరోనా సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని దర్శన భాగ్యం కల్పించారన్నారు. కరోనా సమయంలో కూడా టీటీడీ తరపున పలు సేవా కార్యాక్రమాలు నిర్వహించారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్వామివారి దర్శనం కల్పించడంతోపాటు, ఆస్తుల పరిరక్షణకు కృషి చేసిన ఘనత సుబ్బారెడ్డిదేనన్నారు. టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి మంచి సేవలు అందించారు కాబట్టే ఆయనకు మరోసారి టీటీడీ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. కల్యాణమస్తు, సామూహిక వివాహాలు, దళితవాడల్లో స్వామివారి కల్యాణాలు వంటి కార్యక్రమాలు జరిగాయన్నారు. చంద్రబాబు మెప్పు కోసం జగన్‌ను ఆయన కుటుంబాన్ని, ప్రభుత్వాన్ని ఇష్టం వచ్చినట్టు విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వీసం రామకృష్ణ

వెంకట్‌కు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం



అగనంపూడి: తెలుగు సాహిత్యంలో రంగంలో తనదైన శైలిలో రచనలతో పాఠకుల మన్ననలు అందుకున్న వెంకట్ కంచిపాటి (నరసింహమూర్తి) గిడుగు జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న గిడుగు రామ్మూర్తి పంతులు జయంత్యుత్సవాల సందర్భంగా నరసింహమూర్తికి పురస్కారం అందించనున్నట్టు గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్, శంకర్ వేదిక ప్రతినిధులు తెలిపారు. సాహిత్యం, కళా రంగం, జీవన సాఫల్యం, సేవా రంగాల్లో జాతీయ జాతీయ పురస్కారాలను హైదరాబాద్‌కు చెందిన ఫౌండేషన్ అందిస్తోంది. ఈమేరకు అగనంపూడికి చెందిన యువ కవి, వెంకట్ కంచిపాటి తన కలం నుంచి జాలువారిన 'అతన్నలా వదిలేయకండి' కథా సంపుటికి ఈ అర్హత దక్కినట్టు ఫౌండేషన్ నిర్వాహకులు కళారత్న బిక్కి కృష్ణ, గిడుగు శాంతి కృష్ణ, ధనలక్ష్మి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు అనిల్ (ఫైల్)

నక్కపల్లి : మండలంలో జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. గాజువాకలోని కోరమండల్ ఏరియా ప్రాంతానికిచెందిన చింతా అనిల్ కుమార్(32) మోటారు సైకిల్‌పై కాకినాడ వెళ్తుండగా ఒడ్డిమెట్ట సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అనిల్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

కోర్సుల వివరాలు

ఆడియో ఇంజినీరింగ్-మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లొమాకు రూ.50 వేలు, పీజీ డిప్లొమాకు రూ.1.5 లక్షలు ఫీజుగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్-డబ్బింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్లొమాకు రూ.35 వేలు, పీజీ డిప్లొమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజినీరింగ్‌లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్‌లో 25 మందికి, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో 50 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

భాష..భావాలకు వారధి

- తెలుగు భాషాభ్యున్నతికి పాటుపడిన గిడుగు
- ఏయూ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ
- నేడు తెలుగు భాష దినోత్సవం



ఏయూ తెలుగు విభాగం

ఏయూక్యాంపస్: భాష భావాలకు వారధి. భావాలను పలకించడం అమ్మ నుంచి అలవడుతుంది. అమ్మ నుంచి అబ్బిన భాష మనకు ఆధారంగా మారుతుంది. అమ్మ తొలి పలుకు బిడ్డలో ఆలోచనాశక్తికి ఆలంబనగా నిలుస్తూ పరిసరాలపై అవగాహన పెంచుతుంది. సమాజంపై అవగాహన పెంచడానికి, అనుబంధం పెనవేయడానికి అమ్మభాష ఉపకరిస్తుంది. ప్రపంచ భాషల్లో ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న మన మాతృభాష తెలుగు. నేడు తెలుగు భాషా దినోత్సవం.

తెలుగు వారి ఆస్తి గిడుగు

వాడుక భాష వ్యావహారిక భాష కావాలని పరితపించి, పోరాడి సాధించిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులు, అందరికీ తెలుగు భాషను చేరువ చేయాలనే లక్ష్యంతో వ్యవహారిక తెలుగును వాడుకలోకి తెచ్చిన తొలి వ్యక్తి రామ్మూర్తి పంతులు. ఆయన జయంతి (ఆగస్టు 29)ని తెలుగు భాష దినోత్సవంగా జరుపుకొంటున్నాం. ఆయన 1893 ఆగస్టు 29న పర్వతాలపేటలో జన్మించారు. గురజాడ వేంకట అప్పారావుకు సమకాలీకుడు గిడుగు. బీఏ పట్టా పుచ్చుకునే వరకు ఇద్దరూ కలిసి చదువుకున్నారు. సవరభాషపై ఉన్న ఆసక్తితో ఆ భాషను సైతం గిడుగు రామ్మూర్తి పంతులు నేర్చుకున్నారు.

తొలి విభాగం

భాషా ప్రాతిపదికన ఏర్పడిన ఆంధ్రవిశ్వవిద్యాలయం తొలుత కేవలం నాలుగు కోర్సులతో మాత్రమే ఆరంభమైంది. 1926లో ప్రారంభమైన ఏయూలో తెలుగు, చరిత్ర, అర్థ శాస్త్రం, రాజనీతిశాస్త్రం కోర్సులను ప్రారంభించారు. తెలుగు భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ తొలి ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి ఆంధ్రవిశ్వవిద్యాలయానికి కాస్త భిన్నంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ అని పేరు పెట్టారు. పేరుకు తగ్గట్టుగా తరువాత కాలంలో సంగీతం, నృత్యం, నాటకం వంటి కళలను సైతం దీనిలో భాగం చేశారు. నేటి పాలకులు మరింత ముందుచూపుతో ఆలోచన చేస్తూ డిజిటల్ రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేసి, ఆడియో ఇంజినీరింగ్, ఫిల్మ్ ఎడిటింగ్ వంటి కోర్సులను అందిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు తెలుగు విభాగం విరాజిల్లుతోంది. ప్రస్తుత ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ఇటీవల ఎయిడెడ్ కళాశాలల నుంచి అధ్యాపకులను తీసుకువచ్చి తెలుగు విభాగానికి పూర్వ వైభవాన్ని, జవసత్వాలను అందించారు.

ఏయూకు పుస్తకాలు బహూకరించారు

గిడుగు రామ్మూర్తి పంతులు తాను సేకరించిన, చదివిన అనేక పుస్తకాలను ఏయూలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయానికి బహూకరించారు. నేటికీ ఈ పుస్తకాలు ఇక్కడ భద్రంగా ఉన్నాయి. పద్మకాదంబరి, కుమారకంతము, బాలదేవీభాగవతము, పార్వతీ పరిణయం, గిరిక పెండ్లి, భజనానంద తరంగిణి, మేజువాణీ, పెద్దాపుర సంస్థాన చరిత్రము, నాట్యోత్పలము, మాతృదేశ సంకీర్తనము, మణిమేఖల వంటి పుస్తకాలు ఏయూ గ్రంథాలయంలో భద్రపరిచారు. స్వాతంత్ర్యానికి పూర్వం ముద్రించిన అనేక పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి.

ప్రజారవాణా శాఖ ఖాళీ స్థలాలు 15 ఏళ్ల పాటు లీజుకు

- విజయనగరం జోనల్ సీటీఎం అప్పలనాయుడు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర జిల్లాలో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళంలలో ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) ఖాళీస్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకిస్తున్నట్టు విజయనగరం జోన్ సీటీఎం అప్పలనాయుడు చెప్పారు. స్థానిక ప్రజా రవాణాశాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు. లీజుకు సంబంధించిన విధివిధానాలను పారిశ్రామికవేత్తలకు తెలియజేశారు. www.apsrtc.gov.in వైబ్‌సైట్‌లో టెండర్ ఆప్షన్‌లో లీజుకు సంబంధించిన అన్ని వివరాలు పొందుపరిచినట్టు చెప్పారు. ఈనెల 29వతేదీలోగా ఔత్సాహికులు అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విజయనగరం జోనల్ వర్క్‌షాప్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం వద్ద బాక్స్‌లో ఈనెల 30వతేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా అప్లికేషన్ వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి పద్మావతి, సివిల్ ఎగ్జిక్యూటివ్ నర్సింహరావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు



గంజాయితో పట్టుబడిన కారు



పోలీసులు స్వాధీనం చేసుకున్న లిక్విడ్ గంజాయి

మాకవరపాలెం : కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టగా సఫారీ కారులో తరలిస్తున్న 20 కేజీల ఎండు గంజాయితోపాటు మరో 20 లీటర్ల గంజాయి ద్రావణం పట్టుబడిందన్నారు. దీనిని ఒరిస్సా రాష్ట్రం మల్కాజిగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ చీకటిపల్లి నుంచి బెంగుళూరుకు తరలిస్తున్నారన్నారు. పట్టుబడిన వారిలో కేరళ రాష్ట్రానికి చెందిన నాఫాల్.కె, అల్లూరి జిల్లా చింతపల్లి మండలం ఎ.అన్నవరం, సిరిపురం గ్రామాలకు చెందిన కోరాబు లక్ష్మీనాయుడు(41), కిల్లో శ్రీను (23) ఉన్నారన్నారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి కారు, రూ.15,200 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించామని తెలిపారు.

నాయకులు సరే.. కార్యకర్తలేరీ?

- కేడర్ రాక తుస్సుమన్న టీడీపీ నిరసన
- స్థానిక నేతల తీరుపై ముఖ్యనేతల అసహనం

దేవరాపల్లి: ప్రజాక్షేత్రంలో విశ్వాసం కోల్పోయిన టీడీపీ నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అధికారుల అనుమతితో నిబంధనలకు లోబడి ఇసుక తరలిస్తే అక్రమ రవాణా చేస్తున్నారంటూ అసత్య ఆరోపణలతో రాద్ధాంతం చేయడాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారు. కార్యకర్తల సహకారం కూడా లేకపోవడంతో దేవరాపల్లి మండలం కలిగొట్ల శారదానది వద్ద సోమవారం టీడీపీ నాయకులు చేపట్టిన నిరసన వెలవెలబోయింది. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి, విజయనగరం జిల్లాల నుంచి టీడీపీ ముఖ్య నాయకులు హాజరైనప్పటికీ పదుల సంఖ్యలో సైతం కార్యకర్తలు హాజరుకాకపోవడం ఆ పార్టీని విస్మయానికి గురిచేసింది. ఈ విషయమై పార్టీ ముఖ్యనాయకులు స్థానిక నేతల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే మాదిరిగా వ్యవహరిస్తే పార్టీ మరింత భూ స్థాపితం కావడం ఖాయమని హెచ్చరించినట్లు సమాచారం. మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేచి చూసినా కేడర్ రాకపోవడంతో గత్యంతరం లేక శారదానదిలో కొద్ది సేపు ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన కార్యక్రమాన్ని మమ అనిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కోళ్ల లలితకుమారి, గవిరెడ్డి రామానాయుడు, గిడ్డి ఈశ్వరి, గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లి మండలం కలిగొట్లలో కేడర్ లేకుండానే నిరసనకు దిగిన టీడీపీ నాయకులు

రైవాడ నీటి విడుదలకు వినతి

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలోగల భూములకు రైవాడ నీటిని విడుదల చేయాలని జేసీ జాహ్నవికి ఆమ్‌ఆద్మీ నియోజకవర్గ కన్వీనర్ వినతిపత్రం అందజేశారు. వర్షాధారంపై పండించే రైతులకు కాసింత ఉపశమనం లభిస్తుందని, ఇప్పటికే 80 శాతం వరినాట్లు పూర్తయినప్పటికీ వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన ఉన్నారంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు.

క్షుద్రపూజలు చేస్తున్న ఇద్దరికి దేహశుద్ధి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఏఎంసీ కాలనీలో ఓ ఇంట్లో క్షుద్రపూజల వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ విషయం తెలుసుకున్న కాలనీ వాసులు ఆదివారం రాత్రి క్షుద్ర పూజలు చేస్తున్న ఇద్దరికి దేహశుద్ధి చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

సర్కారీ స్కూళ్లపై పెరుగుతున్న మక్కువ

మనబడి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. సీఎం జగన్ పాలనలో ప్రైవేట్/కార్పొరేట్ విద్యా సంస్థల్ని తలదన్నే సౌకర్యాలు సర్కారీ స్కూళ్లలో ఏర్పడ్డాయి. పాఠ్యాంశాల బోధన కూడా డిజిటల్ బాట పట్టింది. దీంతో గతంలో ఏటా తగ్గుతూ వచ్చిన ఎన్‌రోల్‌మెంట్ ఇపుడు పెరుగుతోంది. సర్కారీ స్కూళ్లపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న నమ్మకమే దీనికి కారణం.


నాడు–నేడులో అందంగా తీర్చిదిద్దిన కశింకోట బాలికల హైస్కూల్


ఐఎఫ్‌పీ బోర్డుపై పాఠ్యాంశాల బోధన

- కశింకోట హైస్కూల్లో పెరిగిన విద్యార్థులు
- సత్ఫలితాలిస్తున్న నాడు–నేడు, డిజిటల్ బోధన

కశింకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ స్కూళ్లు కొత్త పుంతలు తొక్కాయి. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు స్కూళ్లు అభివృద్ధి బాట పట్టాయి. రూ.కోట్ల నిధులతో స్కూళ్లలో సకల సౌకర్యాలు ఏర్పడ్డాయి. దీంతో తల్లిదండ్రుల్లో మార్పు వచ్చింది. విద్యార్థుల చేరికలు పెరిగాయి. కశింకోట బాలికోన్నత పాఠశాలతో సహా, పలు స్కూళ్లలో గతేడాది కంటే విద్యార్థుల సంఖ్య ఈసారి పెరగడం గమనార్హం.

తొలి దశ నుంచే అభివృద్ధి

స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను నాడు–నేడు మొదటి విడతలో రూ.61 లక్షలతో అభివృద్ధి చేశారు. తరగతి గదులకు మరమ్మతులు చేపట్టి, రంగులు వేసి, రాకపోకలకు వీలుగా రోడ్లు, చుట్టూ మొక్కలు పెంచి అందంగా తీర్చిదిద్దారు. ఫలితాలు కూడా అదే స్థాయిలో వస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఈ స్కూల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది 694 మంది విద్యార్థులుండగా, ఈ ఏడాది 713కు పెరిగింది. విశాఖ ఉభయ జిల్లాల స్థాయి పాఠశాలగా దీనికి పేరుంది. ఈ పాఠశాలలో స్థానికులతోపాటు సగం మందికిపైగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చినవారే. పక్కనే ఉన్న సమగ్ర బాలికల వసతి గృహంలో ఉంటూ ఇక్కడ చదువుకుంటున్నారు. ఈ పాఠశాల పీఎంశ్రీ పథకానికి కూడా ఎంపికైంది. రెండో విడత నాడు–నేడులో రూ.36 లక్షలతో అదనంగా మూడు తరగతి గదుల్ని నిర్మిస్తున్నారు.

ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ బోధన

ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) ద్వారా డిజిటల్ తరగతులు, ఆంగ్ల మాధ్యమ బోధన, బై లింగ్వల్ పాఠ్యపుస్తకాలు చదువుపై పిల్లల్లో ఆసక్తి పెంచుతున్నాయి. డిజిటల్ బోధన దృశ్య ప్రధానంగా సాగుతుండటం కూడా ఓ కారణం. ఈ విధానంలో టీచర్లు మరింత ఆసక్తికరంగా బోధించేందుకు వీలవుతోంది. దీంతో పిల్లల అభ్యసన సామర్థ్యాలు పెరిగినట్లు తాజా గణాంకాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల చేరికలు, ప్రభుత్వ సంకల్పానికి బలాన్నిస్తున్నాయి. మండలంలోని బయ్యవరం–2, అమీన్‌సాహెబ్‌పేట ప్రైమరీ స్కూళ్లలో కూడా విద్యార్థుల సంఖ్య గతేడాది కంటే కాస్త పెరిగింది. అమీన్‌సాహెబ్‌పేట ప్రైమరీ స్కూల్లో గతేడాది 54 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది 60 మందికి చేరుకుంది. అమీన్‌సాహెబ్‌పేట స్కూల్లో నాడు–నేడు పనులు ఇప్పటికే పూర్తవగా, బయ్యవరంలో పనులు కొనసాగుతున్నాయి.

చదువుతోపాటు ఆటలు



మాది అల్లూరి జిల్లా సీలేరు గ్రామం. రెండేళ్లుగా ఇక్కడే చదువుతున్నాను. ఇక్కడ సదుపాయాలు, బోధన బాగుంది. పక్కనే ఉన్న వసతి గృహంలో ఉంటూ, ఇక్కడ చదువుకుంటున్నా. వాలీబాల్ ఆట ఇష్టం. ఇక్కడ వాలీబాల్ ఆడుకోవడానికి మైదానం, అనువైన వాతావరణం ఉంది.

–చల్లా గౌరీశ్వరి, విద్యార్థి, సీలేరు

చదువుపై మరింత ఇష్టం



6వ తరగతి నుంచి ఇదే స్కూల్లో చదువుతున్నా. మన బడి నాడు–నేడుతో మా స్కూల్‌ను చాలా బాగా అభివృద్ధి చేశారు. చుట్టుపక్కలున్న ఏ ప్రైవేట్ స్కూల్ కూడా మాకు స్కూల్ ముందు తక్కువే. టీచర్ల బోధన బాగుంది. డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. చదువుపై మరింత ఇష్టం పెరిగింది.

–గొంది పురందేశ్వరి, విద్యార్థి, కశింకోట

నాడు–నేడుతో అన్ని సౌకర్యాలు

నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్ని దాదాపు అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేశాం. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, ప్రోత్సహించడంతో విద్యార్థుల చేరికలు పెరిగాయి. కశింకోట బాలికల హైస్కూల్, బయ్యవరం–2, అమీన్‌సాహెబ్‌పేట ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు చేరారు.

–కె.చిట్టిబాబు, ఎంఈవో, కశింకోట

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీదే అధికారం


అడ్డాం గ్రామంలో రోడ్డు ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


మహిళల ఆశీర్వాదం అందుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: ఎన్నికలు ఎప్పుడు జరిగినా మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని అడ్డాం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను అందించి, అర్హులైనవారెవరైనా పథకాలు అందుకోకపోతే సమీప సచివాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, రైతు భరోసా, వికలాంగులు, వితంతువులు, అవ్వతాతలకు పింఛన్లు, నేతన్న నేస్తం, ఆసరా తదితర పథకాలను అమలు చేస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.20 లక్షలు కేటాయించిన విషయాన్ని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, దీన్ని చూసి ఓర్వలేకే విపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. మళ్లీ జగన్ సీఎం కావడం తథ్యమని, దీనిలో ఎవరికి ఎలాంటి సందేహం అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలన గణనీయంగా జరిగిందన్నారు.

గడప గడపకూ వచ్చిన మంత్రిని పలువురు మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్ రాజు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, కార్యదర్శి బి.చిన్నోడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి రూ.7 లక్షలు

అడ్డాం గ్రామం ప్రధాన మార్గంలో మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.7 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. స్థానికుల అభ్యర్థన మేరకు సచివాలయ అభివృద్ధి నిధులు రూ.20 లక్షల నుంచి వీటికి కేటాయింపులు చేస్తామన్నారు. రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమంతోపాటు, రాష్ట్ర అభివృద్ధికి కూడా సమ ప్రాధాన్యతిస్తుందని పేర్కొన్నారు.

కశింకోటలో 'గడప గడపకు' రేపు


కశింకోటలో సమస్యలను పరిశీలిస్తున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: కశింకోట–3 సచివాలయ పరిధిలో ఈ నెల 30న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని, దీన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పార్టీ శ్రేణులను కోరారు. ముందస్తుగా ఈ సచివాలయ పరిధిలో సోమవారం పర్యటించారు. మంత్రి దృష్టికి తీసుకు రానున్న సమస్యల గురించి పార్టీ శ్రేణులతో చర్చించారు. ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈసీఈ విద్యార్థులకు అపార అవకాశాలు


విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, పలు విభాగాధిపతులు

అనకాపల్లిటౌన్: ఈసీఈ గ్రూప్ విద్యార్థులకు అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని ఈసీఈ విభాగాధిపతి పి.పూర్ణప్రియ అన్నారు. డైట్ కళాశాలలో సోమవారం ఈసీఈ విద్యార్థులకు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులు ఎప్పటికప్పుడు సర్క్యూట్‌బోర్డు, ప్రాజెక్టుల తయారీ విధానాన్ని సులభంగా తెలుసుకునే అవకాశముందన్నారు. విద్యార్థులు తమ సబ్జెక్టుల్లో నైపుణ్యత సాధించి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఇంజినీర్ జి.శిరీష, రిసోర్స్‌పర్సన్ ఎం.ఉమామహేశ్వరరావులు పీసీడీ డిజైన్ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గౌరీ పంచాయతనలో ఓనం పండగ

అనకాపల్లిటౌన్: స్థానిక గౌరీ పంచాయతన దేవాలయంలో మంగళవారం కేరళ సంప్రదాయ ఓనం పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు గౌరీసేవాసంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ పాలు, పెరుగు, నెయ్యి, విభూది, చందనం, పళ్ల రసాలు, అభిషేకానికి అవసరమైన వస్తువులు వెంట తీసుకురావాలని సూచించారు.

తగ్గిన టమాటా ధర


వారపు సంతలో కూరగాయల విక్రయం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.50 ఉన్న టమాటా, ఈ వారం రూ.40కి విక్రయాలు సాగాయి. ఇక ఉల్లిపాయ, బంగాళాదుంప రూ.30, వంకాయ రూ.40, బెండకాయ, దొండకాయ, బీట్రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం, పాదు చిక్కుడు రూ.వందకు అమ్మకాలు జరిగాయి.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్–1
దక్ష	: సత్యనారాయణ స్క్రీన్–2
జైలర్	: షిర్డిసాయి
కింగ్ ఆఫ్ కోథా	: పర్తిసాయి
గాండీవధారి అర్జున	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
బేదురులంక 2012	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 241 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,180	4,420
రెండో రకం	4,060	4,070
మూడోరకం	3,750	4,050

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–3 యూనిట్లు, బీ పాజిటివ్–13 యూనిట్లు, ఓ పాజిటివ్–19 యూనిట్లు, ఓ నెగిటివ్–1 యూనిట్, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 327 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 409 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

దేశ భాషల్లో ఉన్నతమైన భాష తెలుగు


బహుమతులు పొందిన విద్యార్థులతో దాడి రత్నాకర్, స్కూల్ యాజమాన్యం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనకాపల్లిటౌన్: తెలుగు భాషలో ఉన్న ఔన్నత్యం దేశ భాషల్లో మరే భాషకు లేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ ముందస్తు వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలంటే అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అత్యాధునిక విద్య, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలుగు భాషతోపాటు గ్లోబల్ భాష అంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతుల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అంతకుముందు పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ, వసతులను పరిశీలించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, వైఎస్సార్‌సీపీ నేతలు కొణతాల భాస్కర్, దాడి ఈశ్వరరావు, కర్రి అప్పాజీ, కోరిబిల్లి ఆరుద్ర, కోటిపల్లి శ్రీను, కొణతాల పరదేశినాయుడు, కర్రి వెంకటరావు, తణుకు రవి, ఎస్.నాగు, మారిశెట్టి శ్రీను, విల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కశింకోట: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కశింకోటలో సోమవారం నిరసన తెలిపారు. విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. వివిధ రూపాల్లో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని ఆక్షేపించారు. ఈ సందర్భంగా 2000 సంవత్సరంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో అప్పటి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి బలైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

జానీకి అభినందనలు


జానకీరామరాజును శాలువాతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లిటౌన్: విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, 82వ వార్డు ఇన్‌చార్జి మందపాటి జానకీరామరాజును ఆయన కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎ.వి.రత్నకుమారి, ఆళ్ల నాగేశ్వరరావు, గైపూరి రాజు, జాజుల రమేష్, కడిమిశెట్టి సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండా గుప్తులు పార్టీ సీనియర్ నాయకుడు ఏడువాకల నారాయణరావు పాల్గొన్నారు.

'అన్యమతస్తులను తొలగించాలి'


ఆలయం ముందు నిరసనలో బీజేపీ నాయకులు

అనకాపల్లిటౌన్: హిందూ దేవాలయాల్లో అన్యమతస్తుల నియామకాన్ని వెనక్కి తీసుకోవాలంటూ బీజేపీ నేతలు స్థానిక కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి నియామకాలను రద్దు చేయకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఒ.నాగమణి, జిల్లా ఉపాధ్యక్షుడు వి.రమేష్, బి.సాయిరాం, జి.శేషు తదితరులు పాల్గొన్నారు.

సంతకు తగ్గిన మేకలు, గొర్రెల రాక


సంత నుంచి తరలించుకుపోతున్న గొర్రెలు


తాళ్లపాలెం సంతలో విక్రయానికి వచ్చిన గొర్రెలు

- ఆశించిన ధర లేక వెనక్కి తరలింపు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంతలో ఈ సోమవారం కూడా గొర్రెలు, మేకలు తక్కువ వచ్చాయి. గత వారం నుంచి ఇక్కడకు ఇవి తక్కువగా వస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం గొర్రెల మందలకు రుణాలు ఇస్తూ వాటిని రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా ప్రాంత సంతల్లో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఆయా సంతలకు గొర్రెలు అమ్మకానికి తరలి పోతున్నాయి. దీంతో ఇక్కడి సంతకు వాటి రాక తగ్గిపోయింది. సాధారణంగా సంతకు వెయ్యి వరకు గొర్రెలు, మేకలు అమ్మకానికి వచ్చేవి. గత వారం నుంచి వాటిలో సగం కూడా రావడం లేదు. అమ్మకానికి వచ్చిన వాటికి కూడా ఆశించిన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెంపకందారులు, వ్యాపారులు వ్యాన్లలో తిరిగి ఇంటికి తీసుకుపోతున్నట్లు నర్సీపట్నానికి చెందిన పల్లా నాయుడు తెలిపారు. వీటిని ఇతర సంతలకుగాని, మళ్లీ వచ్చే వారం ఇక్కడి సంతకు అమ్మకానికి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఆశించిన ధర వస్తే విక్రయిస్తామన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఉడ్‌పేట విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సమితి జాతీయ నాయకుడు మారేడుపూడి రమేష్ హాజరై సమితి జెండాను ఆవిష్కరించి, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దివ్యాంగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న సంఘ ప్రతినిధుల సేవల్ని కొనియాడారు. దివ్యాంగుల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలను చేస్తామన్నారు. జిల్లాలో దివ్యాంగుల సంఘానికి ప్రత్యేక కార్యాలయ ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు విన్నవించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు జి.రాము, కార్యదర్శి పాత్రుపల్లి వీరుయాదవ్, ఉపాధ్యక్షుడు మేరుగు నూకరాజు, సభ్యులు నాగిరెడ్డి చిన్నమనాయుడు, చిరికి కళ్యాణ్, గాదం కాసులు, సూరాడ ప్రభాకర్, మేరుగు సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బురద, పూడిక తొలగింపు


బురద తొలగించిన అనంతరం రోడ్డు

అనకాపల్లిటౌన్: పట్టణంలో నర్సింగరావుపేట షిర్డీ సాయిబాబా మందిరం వెనుక వీధిలో బురదను ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఇక్కడ చిన్నపాటి వర్షానికీ నీరు నిలిచిపోయి, బురద చేరిపోతోంది. అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో ఈ నెల 10న ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. పారిశుధ్య కార్మికుల సాయంతో బురదను, కాలువల్లో పూడికను తొలగించారు. దీనికి స్పందించిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు బురదను పూర్తిస్థాయిలో తొలగించారు. ఈ విషయంపై జెడ్సీ చక్రవర్తితో సాక్షి మాట్లాడగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత సీజన్లో సదరు వీధిలో అపరిశుభ్ర సమస్య ఎక్కువగా ఉందన్నారు. పూర్తిస్థాయిలో పారిశుధ్య నిల్వలతోపాటు రహదారికిరువైపులా ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామన్నారు. బురద, కాలువల్లో పూడిక తొలగింపుపై సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు జాబితా సవరణలో అప్రమత్తత అవసరం

అనకాపల్లిటౌన్: ఓటరు నమోదు, తొలగింపులో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ బీఎల్వోలను ఆదేశించారు. గుండాలకూడలి సచివాలయం–1లో సోమవారం ఆయన బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లినపుడు సదరు ఓటరు ఉన్నదీ, లేనిదీ తెలుసుకోవడంతోపాటు కొత్త వారెవరైనా ఉంటే వారికి ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. పాత ఓటర్లు ఎక్కడున్నదీ తప్పనిసరిగా గుర్తించాలన్నారు. రెండు చోట్ల ఓటరుగా ఉన్నవాటిపై నిర్ధారణ జరిపి, వారు కోరుకున్న చోట మాత్రమే ఓటును ఉంచాలన్నారు. జీవీఎంసీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ నిర్వహణపై వీవోఏలకు అవగాహన


మాట్లాడుతున్న లీగల్ కంప్లైన్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

కశింకోట: స్వయం సహాయక సంఘాల అకౌంట్లు, ఆడిట్ అంశాలపై వీవోఏలకు అవగాహన ఉండాలని వెలుగు లీగల్ కంప్లైన్స్ కోఆర్డినేటర్ జె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అధ్యక్షతన మండలంలోని వీవోఏలకు రెండు రోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల నిర్వహణ, వాటికి అందించే రుణాల సద్వినియోగం, బీమా, పింఛన్ విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా 11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, ఇనుపకొట్టు నాగేశ్వరరావు వీధి, పూడిమడక రామాలయం ఏరియా, విజయా మెడికల్ సెంటర్, శారదా కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెదహైస్కూల్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ


ఆర్వోప్లాంట్ ఏర్పాటును పరిశీలిస్తున్న జాజుల రమేష్, రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక జీవీఎంసీ పెదహైస్కూల్‌కు రోటరీ క్లబ్ సభ్యులు తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను సోమవారం అందించారు. స్కూల్లో తాగునీటి సమస్యపై 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ఆమె రోటరీ క్లబ్ సభ్యులను ఆర్వో ప్లాంట్ అందించాలని కోరారు. దీంతో స్కూల్ ఆవరణలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు క్లబ్ సభ్యులు చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మితోపాటు, వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, క్లబ్ సభ్యులకు హెచ్‌ఎం రుధిరారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు, సభ్యులు కడిమిశెట్టి సతీష్, రాపేటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.